సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం

ఆధార్ అప్‌డేషన్‌కు ఈనెల 22 నుంచి ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 6 లక్షల మందికి పైగా ఆధార్ అప్‌డేట్ చేయాల్సి ఉంది. 8లో ▸



మెస్ టెండర్ల ఊసే లేదు

నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఎప్పటికి ప్రారంభమవుతుందో అంతుబట్టని విషయంగా మారింది. 8లో ▸

వైభవం.. వాసవీ రథోత్సవం

తాడేపల్లిగూడెంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో అమ్మవారి వెండి రథోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది. 8లో



న్యూస్‌రీల్

ఉన్నత విద్యతో అపార అవకాశాలు



ఫెయిర్‌లో పాల్గొన్న ప్రతినిధులు

తాడేపల్లిగూడెం: యూఎస్‌ఏలో ఉన్నత విద్యను అభ్యసిస్తే అపార అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి అన్నారు. ఏపీ నిట్‌లోని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, అలుమ్ని ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇన్విక్టా కెరీర్ కన్సల్టెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాలోని తొమ్మిది ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో గురువారం హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ టీఏస్‌మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, అసోసియేషన్ డీన్‌లు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ జి.సంతోష్‌కుమార్ పర్యవేక్షించారు.

మహిళను రక్షించిన రైల్వే పోలీసులు

భీమవరం: కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించిన మహిళను భీమవరం రైల్వే పోలీసులు కాపాడారు. రైల్వే ఎస్సై రమణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో నర్సయ్య అగ్రహారానికి చెందిన ధనాల లక్ష్మీగీత, స్వామి భార్యాభర్తలు. వీరి మధ్య కుటుంబ కలహాలు తలెత్తడంతో లక్ష్మీగీత గురువారం జంక్షన్ రైల్వేస్టేషన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించింది. దీనిని గమనించిన రైల్వే పోలీసులు ఆమె ప్రయత్నాన్ని అడ్డుకుని ఆమె భర్త స్వామిని పిలిపించి ఇద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు.

పేరుపాలెం బీచ్‌లో పటిష్ట ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: కార్తీకమాసం సమీపిస్తున్న దృష్ట్యా పేరుపాలెం బీచ్‌లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నవంబర్ 1 నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో బీచ్‌లో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. యాత్రికులు సముద్రంలో లోతుకు దిగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి యువకులు బీచ్ రాకుండా చూడాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సముద్రంలో స్నానాలకు అనుమతి ఇవ్వాలన్నారు. తాగునీరు, బట్టలు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య చర్యలపై సూచనలిచ్చారు. ఏఎస్పీ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.


మావుళ్లమ్మ దీక్షలు ప్రారంభం



పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారి మండల దీక్షను గురువారం 101 మంది భక్తులు స్వీకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ భక్తులకు మాల ధారణ చేయించారు. ఆలయ సహాయ కమిషనర్ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: నాలుగు నెలలుగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ పరిధిలో పలు రహదారులకు నిధులు మంజూరు చేశామన్నారు. భీమవరం నుంచి లోసరి, భీమవరం నుంచి పిప్పర వరకు నాలుగు లైన్లతో జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా రూ.100 కోట్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యం



ద్వారకాతిరుమలలో శ్రీవారి అనివెట్టి మండపంలో కల్యాణ తంతు జరిపిస్తున్న అర్చకులు

వేడుకగా చినవెంకన్న కల్యాణం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం స్వామివారి తిరుకల్యాణోత్సవం గురువారం రాత్రి ఆలయ అనివెట్టి మండపంలో అట్టహాసంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి రజిత సింహాసనంపై ఉంచి వేడుకను ప్రారంభించారు. వివిధ ఘట్టాలను పూర్తి చేసిన తర్వాత శుభముహూర్తాన మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను భక్తుల గోవిందనామస్మరణల నడుమ అట్టహాసంగా జరిపించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు శ్రీవారికి పట్టువస్త్రాలను, రాష్ట్ర ప్రభుత్వం తరపున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వామివారు ఉదయం సింహ వాహనంపై తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగింది. అనివార్య కారణాల వల్ల రాత్రి వెండి గరుడ వాహన సేవ రద్దయింది. ప్రత్యేక అలంకరణల్లో భాగంగా ఆలయ ముఖ మండపంలో స్వామివారు మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం రాత్రి రథోత్సవం నిర్వహించనున్నారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం



కల్యాణ వేడుకను వీక్షిస్తున్న భక్తులు

కూటమి కిక్కుపై కన్నెర్ర

మద్యం షాపులపై మండిపాటు

- భారీ అమ్మకాలే లక్ష్యంగా సిండికేట్లు
- గుడి, బడి, జనావాసాల చెంతనే దుకాణాలు
- జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు
- దుకాణాలు ఏర్పాటు చేయొద్దంటూ అధికారులకు వినతులు
- మరోవైపు అందుబాబులోకి రాని రూ.99 రకం బ్రాండ్
- ధరలు తగ్గలేదంటూ మందుబాబుల పెదవి విరుపు



ఆచంట మండలం వల్లూరులో జనావాసాల మధ్య షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

సాక్షి, భీమవరం: జిల్లాలో కూటమి మద్యం కిక్కుపై జనాగ్రహం మొదలైంది. నివాసాల మధ్య సిండికేట్లు షాపుల ఏర్పాటు ప్రయత్నాలపై నిరసన గళం వినిపిస్తోంది. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే సహించబోమంటూ ఆందోళనలు జరుగుతున్నాయి. గుడి, బడి, జనావాసాల చెంత మద్యం దుకాణాల వల్ల మందుబాబుల ఆగడాలతో చుట్టుపక్కల వారు, భక్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ధర్నాలకు దిగుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాజీవనానికి భంగం వాటిల్లకుండా దూరంగా ప్రభుత్వ మద్యం దుకాణాలను నిర్వహించింది. పర్మిట్ రూమ్‌లను ఎత్తివేయడం ద్వారా కేవలం అమ్మకాలే తప్ప షాపుల వద్ద మద్యం సేవించే వీలు లేకుండా చేసింది. బెల్టు షాపులను పూర్తిగా తొలగించింది.

నిబంధనలు కాలరాసి..

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీలో భారీగా మద్యం అమ్మకాలను చేయడమే లక్ష్యంగా రద్దీ ప్రాంతాలు, జనావాసాల మధ్య షాపుల ఏర్పాటుకు సిండికేట్లు ప్రాధాన్యమిస్తున్నాయి. గుడి, బడి, ఆస్పత్రులకు సమీపంగా షాపుల ఉండరాదన్న నిబంధనలను నిర్వాహకులు తుంగలోకి తొక్కుతున్నారు. మందుబాబులు షాపుల వద్దే మద్యం సేవించేందుకు వీలుగా పర్మిట్ రూమ్‌లు తెరిచే ప్రయత్నాల్లోనూ ఉన్నారు. జనావాసాలు, విద్యాసంస్థల వద్ద షాపులు తెరిచే ప్రయత్నాలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

నరసాపురంలో విద్యార్థినుల నిరసన

నరసాపురం పట్టణంలో 216 జాతీయ రహదారి పక్కన గల కళాశాల సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు ప్రయత్నాలను విద్యార్థులు అడ్డుకున్నారు. కళాశాల చెంత మందుబాబుల ఆగడాలతో విద్యార్థినులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఆర్డీఓ కార్యాలయంలో అధికారులను కలిసి షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా వినతిపత్రాలు అందజేశారు. దీంతో షాపు ఏర్పాటు ప్రయత్నాలను నిర్వాహకులు తాత్కాలికంగా విరమించారు.

పెనుగొండలో ధర్నా

ఆచంట నియోజకవర్గం పెనుగొండ, ఆచంట మండలం వల్లూరు గ్రామాల్లో మద్యం దుకాణాలు జనావాసాల మధ్య ఏర్పాటు చేయవద్దంటూ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వీరికి సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు.

వల్లూరు గ్రామస్తుల వినతి

ఆచంట మండలం వల్లూరులో కూడా దుకాణం ప్రాంతంలో స్థానికులు ధర్నా నిర్వహించారు. జనావాసాల చెంత షాపుల వలన మద్యం మత్తులో తరచూ గొడవలు జరిగి చుట్టుపక్కల వారు తీవ్ర ఇబ్బందులకు పడాల్సి వస్తుందని, షాపు ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నివాసాల చెంత షాపు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వద్దని కోరుతూ గురువారం భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్ నాగరాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆందోళనల నేపథ్యంలో ఆయా షాపులను సిండికేట్లు ఇంకా ఓపెన్ చేయలేదు. కాగా తాత్కాలిక లైసెన్సులు అంటూ అధికారులు ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

సోషల్ మీడియాలో సెటైర్లు

కొత్త మద్యం పాలసీలో ధరలు దిగిరాకపోవడంతో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.

'అమ్మకు వందనం కంటే ముందు నాన్నకు ఇంధనం వచ్చింది',

'అవే బ్రాండ్లు.. అవే బీర్లు.. అవే రేట్లు.. ఏం మారింది.. ఇంతకుముందు ప్రభుత్వ ఖజానాకు వెళ్లే డబ్బులు ఇప్పుడు తెలుగు తమ్ముళ్ల జేబుల్లోకి వెళ్తాయి అంతే..' అంటూ పోస్టులు పెడుతున్నారు. అధిక సంఖ్యలో లైకులు, షేర్లతో ఇప్పుడివే ట్రెండింగ్‌లో ఉన్నాయి.

ధరలు తగ్గలేదు.. రూ.99 మద్యం లేదు

నాణ్యమైన మద్యాన్ని పేదవారికి రూ.99లకే ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ప్రకటించారు. అలాగే మిగిలిన బ్రాండ్ల ధరలూ తగ్గిస్తామని హామీ ఇచ్చారు. సోషల్ మీడియాలోనూ ధరల తగ్గుదలపై విపరీతంగా ప్రచారం జరిగింది. గతంలో క్వార్టర్ రూ.150లు ఉన్న బ్రాండ్లలో రూ.30 వరకు, రూ.220, రూ.230 వరకు ధరలు ఉన్న బ్రాండ్లలో రూ.50 వరకు తగ్గవచ్చని, బీర్లు అయితే రూ.150 నుంచి రూ.180కు వచ్చేస్తాయంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. కూటమి నేతల హామీలతో కొత్త మద్యం పాలసీలో ధరలు దిగివస్తాయని మందుబాబులు ఆశగా ఎదురుచూశారు. కాగా ఎన్నికల వాగ్దానాన్ని తుంగలోకి తొక్కి వారి ఆశలపై సీఎం చంద్రబాబు నీళ్లు చల్లారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరుచుకుంటుండగా కొత్త స్టాకులు వస్తున్నాయి. అయితే ఏ దుకాణంలో కూడా రూ.99 లిక్కర్ దొరకని పరిస్థితి. మద్యం ధరల్లో తగ్గుదల లేకపోవడం మందుబాబులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గత ప్రభుత్వంలో చీప్ లిక్కర్ రూ.120కు విక్రయించగా ఇప్పుడు రూ.130 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందంటూ పెదవి విరుస్తున్నారు. మున్ముందు సిండికేట్లు, ఎక్సైజ్ అధికారులు కుమ్మక్కై ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మకాలు చేస్తే తమకు మరింత అదనపు భారం తప్పదని వాపోతున్నారు.

పారదర్శకంగా సదరం శిబిరాలు



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో నిర్వహిస్తున్న సదరం క్యాంపులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పారదర్శకంగా క్యాంపులు నిర్వహిస్తారన్నారు. శిబిరాల వద్ద ఇబ్బందులుంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. క్యాంపుల నిర్వహణ వివరాలను గురువారం ఆమె వెల్లడించారు.

- **తణుకు జిల్లా ఆస్పత్రి:** ఎముకలు, కండరాలు, కంటి, మూగ, చెముడు వైకల్యం, మానసిక వికలాంగత్వ పరీక్షలకు మంగళ, శుక్రవారాల్లో క్యాంపులు నిర్వహిస్తారు.
- **తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రి:** ఎముకలు, కండరాల వైకల్యం, కంటి వైకల్యం పరీక్షలకు మంగళ, శుక్రవారాల్లో క్యాంపులు నిర్వహిస్తారు.
- **భీమవరం ఏరియా ఆస్పత్రి:** ఎముకలు, కండరాల వైకల్యం పరీక్షలకు సోమవారం క్యాంపు నిర్వహిస్తారు.
- **నరసాపురం ప్రభుత్వ ఆస్పత్రి:** ఎముకలు, కండరాల వికలాంగత్వం పరీక్షలకు బుధవారం క్యాంపు నిర్వహిస్తారు.
- **పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రి:** ఎముకలు, కండరాల వికలాంగత్వం పరీక్షలకు బుధవారం క్యాంపు నిర్వహిస్తారు.
- **ఆకివీడు సీహెచ్‌సీ:** ఎముకలు, కండరాలు వికలాంగత్వ పరీక్షలకు బుధవారం క్యాంపు నిర్వహిస్తారు.
- **ఆచంట సీహెచ్‌సీ:** ఎముకలు, కండరాలు వికలాంగత్వ పరీక్షలకు బుధవారం క్యాంపు నిర్వహిస్తారు.

నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రమణారావు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రాయపూర్ నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడినట్టు ఏపీ నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపడతారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మహిళా నేతపై దాడి

చాట్రాయి: వైఎస్సార్‌సీపీ మహిళా నేత పెదగర్ల స్వరూపరాణిపై తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు దాడి చేసి గాయపరచిన సంఘటన చాట్రాయి మండలం కాట్రేనిపాడులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కోన లలితకు మారి వెలుగు పథకంలో బుక్ కీపర్ కాగా ఆమెను అనధికారికంగా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆమె వైఎస్సార్‌సీపీ స్టేట్ హిస్టరీ అకాడమీ మాజీ డైరెక్టర్ పెదగర్ల స్వరూపరాణిని కలిశారు. ఆమె సూచన మేరకు సోమవారం డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ మహిళా నేతలు ఆమర్తల లక్ష్మి, ముత్తవరపు ప్రభ బుధవారం రాత్రి 8 గంటల సమయంలో కాట్రేనిపాడులోని స్వరూపరాణి ఇంటికి వెళ్లి దుర్భాషలాడుతూ ఇనుప చువ్వతో కొట్టి గాయపరిచారు. తీవ్ర గాయాలపాలైన స్వరూపరాణిని కుటుంబసభ్యులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం స్వరూపరాణి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

అల్లకల్లోలం



పేరుపాలెం బీచ్‌లో వైఎస్సార్ విగ్రహం వరకూ చొచ్చుకుని వచ్చిన సముద్రం

- తీరంలో భయం.. భయం
- 200 మీటర్ల మేర చొచ్చుకొచ్చిన సముద్రం

నరసాపురం: నరసాపురం తీర ప్రాంత ప్రజలు గురువారం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. 2003 సునామీ ప్రళయాన్ని గుర్తు చేసేలా కడలి కల్లోలంగా మారింది. పెద్ద ఎత్తున అలలు ఎగసిపడటంతో పాటు 200 మీటర్ల మేర సముద్రం చొచ్చుకువచ్చింది. బుధవారం రాత్రి నుంచి 'అల'జడి కొనసాగుతోంది. సాధారణంగా అమావాస్య, పౌర్ణమి రోజుల్లో అలల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పౌర్ణమి కావడంతో పాటు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం కూడా కారణంగా తెలుస్తోంది. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. నరసాపురం మండలం చినమైనవానిలంక, పెదమైనవానిలంక, మొగల్తూరు మండలంలో పేరుపాలెం బీచ్‌ల్లో గురువారం పరిస్థితి తీవ్రంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో 200 మీటర్ల మేర సముద్రం చొచ్చుకు వచ్చింది. పేరుపాలెం బీచ్‌లో వైఎస్సార్ విగ్రహం వరకు కెరటాలు రావడంతో యాత్రికులు పరుగులు తీశారు. నరసాపురం మండలం చినమైనవానిలంకలో పాత తుపాను షెల్టర్ భవనం వరకు అలలు వచ్చాయి. అలాగే పెదలంక, తూర్పుతాళ్లు, మోళ్లపర్రు ప్రాంతాల్లో సముద్ర గట్టు కోతకు గురయ్యింది. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. సాయంత్రం వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం స్పందించలేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరుపాలెం బీచ్‌లో యాత్రికుల రాకపోకలను నిషేధించి ఇద్దరు కానిస్టేబుళ్లను కాపలా పెట్టి చేతులు దులుపుకున్నారని అంటున్నారు.



పెదమైనవానిలంకలో చొచ్చుకువచ్చిన సంద్రం



వేములదీవిలో కోతకు గురైన కొబ్బరి చెట్లు

గోతుల్లో మొక్కలు.. అధ్వానంగా రహదారులు



రోడ్డుపై మొక్కలు

మొలవడం ఏంటని అనుకుంటున్నారా.. అవునండీ ఇది నిజం. వర్షం నీటితో నిండిన గుంతల్లో మొక్కలు మొలిచి రోడ్ల దుస్థితికి అద్దం పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో గ్రామీణ రహదారులు వర్షాలకు ఛిద్రంగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. భారీ గోతులతో చెరువులను తలపించడంతో పాటు ఇలా మొక్కలు మొలుస్తున్నాయి. పాలకోడేరు మండలంలో శృంగవృక్షం-యిమునాపల్లి రోడ్డులో మొక్కలు మొలిచిన దృశ్యమిది.

- పాలకోడేరు

క్లుప్తంగా

19న భీమవరంలో చెస్ పోటీలు



చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన భీమవరంలోని ఆర్య వైశ్య వర్తక సంఘ భవనం (త్యాగరాజు భవనం)లో డిస్ట్రిక్ట్ లెవెల్ ర్యాంకింగ్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. గురువారం పోటీలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం సహకారం అందిస్తున్నారని తెలిపారు. వివరాలకు ఫోన్: 9063224466లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

19 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల వివరాలు వెల్లడిస్తున్న కళాశాల డైరెక్టర్ జగపతిరాజు

భీమవరం: ఈ నెల 19, 20 తేదీల్లో భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ–కే 'మెన్ అండ్ ఉమెన్' సెంట్రల్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతిరాజు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాల క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వీటితో పాటు ఈ నెల 26, 27 తేదీల్లో బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ 'మెన్ అండ్ ఉమెన్' సెంట్రల్ జోన్ పోటీలు కూడా తమ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే సురేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణ రాజు సౌత్ జోన్‌కు వెళ్లే టీమ్‌లను కూడా ఇక్కడే యూనివర్సిటీ స్పెషల్ టీం సెలెక్ట్ చేయడం జరుగుతుందని వెల్లడించారు.

పంచారామ క్షేత్రం హుండీ ఆదాయం రూ.7.53 లక్షలు



క్షేత్రంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పంచారామ క్షేత్రం శ్రీసోమేశ్వర జనార్దన స్వామి వార్ల దేవస్థానం హుండీలను గురువారం లెక్కించారు. 124 రోజులకుగాను రూ.7,53,338 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.కృష్ణంరాజు తెలిపారు. బంగారం 11 గ్రాముల, 400 మిల్లీగ్రాములు, వెండి 275 గ్రాముల 100 మిల్లీ గ్రాములు, విదేశీ నగదు కెనడా డాలర్ నోటు 1, సింగపూర్ డాలర్ల నోట్లు 12, ఖతార్ రియల్స్ నోట్లు 10, అమెరికన్ డాలర్ నోట్లు 2 లభించినట్లు ఈవో తెలిపారు.

మెస్ టెండర్ల ఊసే లేదు

- ట్రిపుల్ ఐటీ మెస్ టెండర్లు అక్టోబర్ ప్రారంభంలోనే పిలుస్తామన్న డైరెక్టర్
- 20 రోజులు గడిచినా ఇప్పటికీ టెండర్లు పిలవని వైనం

అక్టోబర్ మూడో తేదీలోగా టెండర్లు పిలిచి, నవంబరు ఒకటి నుంచి నూతన మెస్ నిర్వాహకులతో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు భోజనాలు అందిస్తాం.

– ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ సెప్టెంబర్ 25న మీడియాకు వెల్లడి

మెస్ నిర్వహణ వ్యవస్థను సాధ్యమైనంత త్వరితగతిన బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– త్రిసభ్య కమిటీ సభ్యులు సెప్టెంబర్ 20న మీడియా ముందు వెల్లడించిన విషయం



ట్రిపుల్ ఐటీలోని మెస్

నూజివీడు : ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఎప్పటికి ప్రారంభమవుతుందో అంతు బట్టని విషయంగా మారింది. అక్టోబర్ మూడో తేదీలోగా మెస్‌ల నిర్వహణకు టెండర్లు పిలుస్తామని, ప్రతి రెండువేల మంది విద్యార్థులకు ఒక మెస్ ఉండేలా నూతన కేటరర్లను ఖరారు చేసి నవంబరు ఒకటో తేదీ నుంచి నూతన మెస్ నిర్వాహకులను సిద్ధం చేస్తామని చెప్పగా, ఇప్పటికే అక్టోబర్‌లో 17 రోజులు ముగిసిపోయాయి. ఇంతవరకు టెండర్లు కూడా పిలవకపోవడం గమనార్హం. ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణ సరిగా లేదంటూ గతంలో ఉన్న అనూష కేటరర్స్, ఫైన్ కేటరర్స్‌ను తొలగించడంతో పాటు 6,600 మంది విద్యార్థులందరికీ భోజనాలు పెట్టే బాధ్యతను కేఎంకే మెస్‌కు అప్పగించారు. అంతమంది విద్యార్థులకు ప్రతిరోజూ ఒక్క మెస్సే రెండు పూటలా భోజనం, ఒకపూట టిఫిన్, సాయంత్రం స్నాక్స్ అందించాల్సి ఉంది. కేఎంకే కేటరర్స్‌కు అంత సామర్థ్యం ఉందా లేదా అనే ఆలోచన కూడా చేయకుండా ఏకపక్షంగా అప్పగించేయడం గమనార్హం. ఒకే ఒక కేటరర్‌కు ఎక్కువ రోజులు పెద్ద ఎత్తున విద్యార్థులను అప్పగించడం కూడా సమంజసం కాదనే అభిప్రాయాన్ని కాలేజీ ఎడ్యుకేట్ కమిషనర్ పోలా భాస్కర్ సైతం వెల్లడించారు. త్రిసభ్య కమిటీ గత నెల 20న నూజివీడు ట్రిపుల్ ఐటీకి వచ్చి అధికారులకు టెండర్ల విషయమై పలు సూచనలు చేసి వెళ్లింది. వారు వచ్చి వెళ్లి దాదాపు నెలరోజులవుతున్నా ఇంతవరకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఇప్పటికీ టెండర్ల ప్రక్రియే రూపొందించలేదంటే మరో నెల రోజుల వరకు కొత్త కేటరర్లు వచ్చే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు. ఎందుకంటే టెండరు పిలిచిన తరువాత కనీసం 15 రోజులు గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత ఫైనాన్స్ బిడ్, టెక్నికల్ బిడ్‌లను పరిశీలించాలి. అనంతరం టెండర్లను తెరవాలి. దీనంతటికీ కనీసం 20 రోజులకు పైగా సమయం పడుతుంది. అంటే.. మరో నెల రోజుల పాటు కేఎంకే కేటరరే 6,600 మంది విద్యార్థులకు భోజనం అందించాల్సి ఉంటుంది.

రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తాం

మెస్ టెండర్లకు సంబంధించి విధివిధానాలు రూపొందించడంలో జాప్యం నెలకొంది. అక్టోబర్ మొదటి వారంలోనే టెండర్లు పిలుద్దామని అనుకున్నా కుదరలేదు. అంతా సిద్ధం చేయడం పూర్తయినందున మరో రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తాం.

– బి.లక్ష్మణరావు, ఏఓ, ట్రిపుల్ ఐటీ నూజివీడు

ఆధార్ అప్‌డేషన్‌కు మరోసారి అవకాశం

ఈనెల 22 నుంచి 25 వరకు ప్రత్యేక శిబిరాలు



ఆధార్ నమోదు కేంద్రం

నూజివీడు : ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలన్నా, విద్యా ఉద్యోగాలకు, డ్రైవింగ్ లైసెన్స్‌కు, పాన్‌కార్డు పొందాలన్నా, బ్యాంక్ ఖాతా ప్రారంభించాలన్నా... ప్రతి ఒక్క దానికి నేడు ఆధార్ కార్డ్ తప్పనిసరైంది. అయితే ఈ ఆధార్‌కార్డులో తప్పులున్నా, వేలిముద్రలు అప్‌డేట్ కాకపోయినా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా మంది ఆధార్‌కార్డులు తీసుకొని 15 సంవత్సరాలు పూర్తయిన వారు ఉన్నారు. ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు దాటిన వారందరూ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం చెబుతుంది. ఆధార్ అప్‌డేషన్ చేసేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. పట్టణాల్లోని వార్డు సచివాలయాల్లోను, గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో గత ప్రభుత్వంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా మరోసారి ఈనెల 22నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఈ శిబిరాల్లో నూతన ఆధార్‌కార్డుల కొరకు నమోదు, వేలిముద్రల అప్‌డేషన్, చిరునామాల మార్పు, ఆధార్‌కార్డుపై ఫొటో అప్‌డేట్, ఇతర తప్పులను మార్చుకునేందుకు వీలుంటుంది. అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా బాల ఆధార్ తీసుకునే వీలుంది. అయితే ఐదేళ్ల వయస్సు దాటిన తరువాత పిల్లలందరూ తమ వేలిముద్రలను అప్‌డేట్ చేసుకోవాలి. అప్పుడే వారి వేలిముద్రలు నిక్షిప్తమవుతాయి. ఈ శిబిరాలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. వార్డు, గ్రామ సచివాలయాల్లోను, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో సైతం ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఆధార్ కిట్లు సమకూరిన సచివాలయాలు ఈ సేవలను అందిస్తాయి.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వేలిముద్రలు అప్‌డేట్ చేయించుకోవాల్సిన వారి సంఖ్య

జిల్లా	5–15 ఏళ్లలోపు	15–17 ఏళ్లలోపు	18 ఏళ్లు పైబడినవారు
ఏలూరు	72,688	1,13,144	1,85,832
పశ్చిమగోదావరి	48,730	68,256	1,16,986
మొత్తం	1,21,418	1,81,400	3,02,818

వైభవం.. వాసవీ మాత రథోత్సవం



రథోత్సవంలో వెండి కలశాలతో మహిళలు



వెండి రథంలో అమ్మవారి ఊరేగింపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం టూటౌన్‌లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలోని అమ్మవారి వెండి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ రథోత్సవాన్ని ప్రారంభించారు. 108 వెండి కలశాలతో 108 మంది మహిళలు, ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన 250 మంది కళాకారులు, విభిన్న వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలు, బాణసంచా పేలుళ్లు, తమిళనాడుకు చెందిన డప్పు కళాకారులు, లైటింగ్ నడుమ రథోత్సవం ఆకట్టుకుంది. ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వాసవి వనిత, మహిళా సంఘాలు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ఆర్యవైశ్య నాయకులు పేరూరి కాశయ్య, కోన శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వబిలిశెట్టి నటరాజు, అధ్యక్షుడు కొర్లెపల్లి రాము, ఆర్యవైశ్య కార్యదర్శి నున్న సుందరరావు, రథోత్సవ కమిటీ చైర్మన్ నారాయణ రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రతన్ టాటా కాంస్య విగ్రహం తయారీ



పెనుమంట్ర: మండలంలోని నత్తా రామేశ్వరంలో దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని శిల్పి పెనుగొండ కరుణాకర్ ఉడయార్ తయారు చేస్తున్నారు. ఉండికి చెందిన ప్రజాప్రతినిధి ఇచ్చిన ఆర్డర్ మేరకు ఈ విగ్రహం తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెనుగొండ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోడూరు – మినిమించిలిపాడు రహదారి మార్గంలో మినిమించిలిపాడు వద్ద బుధవారం సాయంత్రం నౌడూరుకు చెందిన బండి గణేష్ (22), ఆచంట వేమవరం గ్రామానికి చెందిన వరద శివరామకృష్ణ ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. శివరామకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో భీమవరంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ ఆకస్మిక తనిఖీ



హాస్టల్‌లో విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని పోస్ట్ మెట్రిక్ ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌ను గురువారం రాత్రి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ. పి.ధాత్రిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌లో బాలికల వసతి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజన వసతి, శానిటేషన్ అమలు, స్టడీ అవర్లో అమలవుతున్న విద్యా విధానాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో సిబ్బందిపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఐటీడీఏ డీడీ నాయుడు, తహసీల్దార్ కే చెల్లన్న దొర ఉన్నారు.

శ్రీవారి డైరీ, క్యాలెండర్‌ల ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌లను చూపుతున్న చైర్మన్, ఈఓ

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవారి 2025 నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు గురువారం ఆవిష్కరించారు. కొండపైన ఆయన ఛాంబర్‌లో ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ భాస్కర్‌లతో కలసి వాటిని ప్రారంభించారు. డైరీ రూ. 150, సింగిల్ పేజి క్యాలెండర్ రూ.35, మల్టీపేజీల క్యాలెండర్ రూ.120కు విక్రయించాలని నిర్ణయించారు. దేవస్థానం ఫొటోస్టాల్‌లో భక్తులకు వీటిని అందుబాటులో ఉంచుతామని చైర్మన్ సుధాకరరావు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు


యలమంచిలి: తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని కొంతేరు గ్రామానికి చెందిన రేజేటి కోమలి గురువారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. కోమలికి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన పూడివలస రాజుతో క్రిస్టియన్ సంప్రదాయంలో వివాహమైంది. వివాహ సమయంలో రూ.3.50 లక్షలు నగదు, రెండు కాసులు బంగారం కట్నం ఇచ్చారు. వీరి సంసారం ఆరు నెలలు బాగానే సాగింది. ఆ తర్వాత నుంచి అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు శారీరికంగా, మానసికంగా వేధిస్తున్నారని కోమలి ఫిర్యాదులో పేర్కొంది. గత నెల 14న అదనపు కట్నం తీసుకురాకపోతే కుదరదని తరిమేయడంతో పుట్టింటికి వచ్చేసింది. ఈ మేరకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు.

వివాహిత ఫిర్యాదు..

కాళ్ల: అదనపు కట్నం వేధింపులపై వివాహిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుపాడు గ్రామానికి చెందిన ఆదిగిరి నాగలక్ష్మికి ఆకివీడు మండలం దుంపగడప గ్రామానికి చెందిన మావుళ్ళయ్యతో సుమారు 26 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక అమ్మాయి, అబ్బాయి సంతానం. అయితే ఇప్పుడు ఆమెను అదనంగా లక్ష రూపాయలు అదనపు కట్నం తీసుకు రావాలంటూ భర్త, అతని సోదరుడు, అత్తమామలు వేధిస్తున్నారంటూ నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా..

అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా వరాహ పుష్కరిణి



వరాహ పుష్కరిణి మెట్లపై మద్యం సేవిస్తున్న వ్యక్తులు

ఆగిరిపల్లి: జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారికి చెందిన వరాహ పుష్కరిణి మందుబాబులకు అడ్డాగా మారింది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన రాష్ట్రంలోనే అతి పెద్దదైన వరాహ పుష్కరిణి (మెట్ల కోనేరు) అసాంఘిక కార్యకలాపాలకు వేదికైంది. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో రాత్రయితే చాలు వరాహ పుష్కరిణి మెట్లపై మందుబాబులు మద్యపానం, ధూమపానం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో మద్యం సీసాలు, చికెన్ వ్యర్థాలు, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. వరాహ పుష్కరిణి పవిత్రతను కాపాడి మందుబాబుల ఆగడాలు అరికట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ఇదే విషయంపై ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ వరాహ పుష్కరిణి మెట్లపై మద్యపానం, ధూమపానంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

క్లుప్తంగా

రావిపాడు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



రావిపాడు గ్రామంలో పూజలందుకొంటున్న కనకదుర్గమ్మ అమ్మవారు

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కనకదుర్గమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వీజ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు తాతారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, కమిటీ సభ్యు లు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ



పట్టింపాలెంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పట్టింపాలెం గ్రామంలో గురువారం గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టీవీ. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది 258 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. కుంచనపల్లి గ్రామంలో మరో 200జీవాలకు నట్టల నివారణ మందు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ పూర్ణ ప్రసాద్ తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



బాణసంచా విక్రయాలపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం: ప్రభుత్వం నియమ నిబంధనలకు అనుగుణంగా బాణసంచా విక్రయాలు జరపాలని పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద బాణ సంచా వ్యాపారులతో సమీక్ష నిర్వహించారు. హోల్ సేల్, రిటైల్ బాణ సంచా వ్యాపారులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బాణసంచా దుకాణాలు వద్ద తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నియమ నిబంధనలు అతిక్రమించినవారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని హెచ్చరించారు.

అప్స వారిచే సేవారత్న అవార్డులు



మాట్లాడుతున్న ఎంఈఓ హనుమ

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన కరస్పాండెంట్స్, డైరెక్టర్స్‌కు, సీనియర్ సిటిజన్స్‌కు సేవా రత్న అవార్డులు అందజేశారు. అప్స రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూము వాసు, జోన్‌సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు ఎంఈఓలు హనుమ, పీఎంకే జ్యోతి, ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణలు హాజరైయారు. అప్స రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

పెంటపాడు: భూ సమస్యల పరిష్కారానికి 18నుంచి గ్రామ సభలు ఏర్పాటుచేస్తున్నట్లు తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని 18న కోరిమిల్లి, చింతపల్లిలో, 19న రాచర్ల, 21న వల్లూరుపల్లి, 22న ఆకుతీగపాడు, బోడపాడు, 23న ముదునూరు, దర్శిపర్రు, 24న ఎస్ఆర్‌పీ అగ్రహారం, యానాలపల్లి, 25న కె. పెంటపాడు, 26న జట్లపాలెం, మౌంజీపాడు, 28న పరిమెళ్ల, 29న రావిపాడు, 30న మీనవిల్లూరు గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

తణుకు టౌన్: పట్టణంలో ఉన్న ప్రైవేట్ ఖాళీ స్థలాల్లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లిరాధాకృష్ణ మున్సి పల్ సిబ్బంది కోరారు. గురువారం తణుకులోని 29వ వార్డులో నిర్వహించిన గ్రామ దర్శిని కార్యక్రమంలో భాగంగా ఆయన వార్డులోని వీధులలో పర్యటించారు. వార్డులోని ప్రజలనుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమీషనర్, బీజేపీ, జన సేన, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలతో సెల్‌గాటం

- యథేచ్ఛగా సెల్‌ఫోన్ డ్రైవింగ్
- తరచూ ప్రమాదాలు
- పోలీసుల నిఘా

పెంటపాడు: సెల్‌ఫోన్ అనేది నేడు ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమైన వస్తువుగా మారింది. అది లేకపోతే కాలుబయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జేబులో డబ్బులు పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్ ఉంటే చాలు. ప్రయాణం, షాపింగ్, భోజనం, సినిమా, విహారం, వినోదం, ఆర్థిక లావాదేవీలన్నీ క్షణాల్లో చేయవచ్చు. ఫోన్ ఉంటే చాలు ప్రపంచమంతా మన చేతిలోనే ఉంటుంది. ఇంత ముఖ్యమైన సెల్ ఫోన్‌ను విచ్చలవిడిగా వాడడం వల్ల లేనిపోనిప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా మంది మోటారు సైకిళ్లపై ప్రయాణిస్తూ సెల్ ఫోన్ మాట్లాడుతూ కనిపిస్తున్నారు. భుజానికి, చెవికి మధ్య ఫోన్ పెట్టుకుని మాట్లాడుకుంటూ వెళ్లిపోతుంటారు. ఇది నిబంధనలకు విరుద్ధమని పోలీసు లు ఎన్నిసార్లు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

అనేక ప్రమాదాలు

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపడం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు వాహన చోదకులు మృత్యువాత పడుతున్నారు. ఇంకొన్ని సందర్భాల్లో ఎదురుగా వచ్చే వారిని ఢీకొంటున్నారు. సెల్‌ఫోన్‌కి కాల్ వచ్చినప్పుడు రోడ్డు పక్కన బండి ఆపి, మాట్లాడుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ ఆ విషయాన్ని కొందరు అస్సలు పట్టించుకోవడం లేదు. చెవికి, భుజానికి మధ్యలో సెల్ నొక్కిపెట్టి దృష్టి ఎక్కడో పెట్టి వాహనాలకు నడుపుతున్నారు. ఈ సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకు గురై మంచాన పడుతున్న వారు కొందరైతే మెడలు వంచి ఫోన్ మాట్లాడి అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నవారు ఇంకొందరు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలకు సెల్ డ్రైవింగ్ ప్రధాన కారణం అవుతోంది. ఇటువంటి ప్రమాదాలను నివారించడానికి పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నా వారిపై నిఘా పెట్టారు. దీనిలో భాగంగా భీమవరం పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1012 సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. వీటి నుంచి రూ.10.12 లక్షల జరిమానా వసూలు చేశారు.



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న దృశ్యాలు



యువతే ఎక్కువ



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడుతున్న వారిలో ప్రధానంగా యువతే ఎక్కువగా ఉంటున్నారు. వీరిలో విద్యార్థులు మరింత మంది ఎక్కువగా ఉండటం గమనార్హం. ఫోన్ చెవిన పెట్టుకొని వేగంగా డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక పెంటపాడు– గూడెం రోడ్డులో ఇద్దరు విద్యార్థులు రెండు నెలల క్రితం మృత్యువాత పడ్డారు. పెంటపాడు కళాశాల సెంటర్, శశి కళాశాల రోడ్డు, గూడెం జెడ్పీస్కూలు, బస్టాండ్ ప్రాంతాలలో ఎక్కువ మంది విద్యార్థులు సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ బైక్‌లు నడుపుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధానంగా ఈ పరిస్థితి ఉంది.

– కొవ్వూరు ప్రసాద్‌రెడ్డి, ఎంబీఆర్ ఫౌండేషన్, ముదునూరుపాడు

నిఘా పెట్టాం



దీంతో పాటు, ఫోన్‌లు మాట్లాడే వారితో పాటు, ఎదురుగా వచ్చేవారు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైవింగ్‌లో ఫోన్ వస్తే రోడ్డు పక్కగా వాహనాన్ని ఆపి మాట్లాడుకోవాలి. ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకొంటున్నాం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నవారిపై పలు సెంటర్లలో నిఘా పెట్టాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం.

– కొండలరావు, గూడెం ట్రాఫిక్ ఎస్సై

నర్తనం.. జీవితం పరివర్తనం

- శాస్త్రీయ నృత్యంపై పెరుగుతున్న ఆసక్తి
- సెల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉంచేందుకు మార్గంగా నృత్య శిక్షణ

తణుకు టౌన్: తెలుగు రాష్ట్రాల్లో ఏ పండుగ రోజైనా ఆట పాటలతో ఉత్సాహంగా జరుపుకుంటారు. పూర్వం కాలంలో దసరా, సంక్రాంతి, ఉగాది, శివరాత్రి, వినాయక చవితి వంటి వేడుకలలో పౌరాణిక నాటకాలు, సినిమాలు, హరికథలు, బుర్ర కథలతో వినోదం పొందేవారు. అయితే తెలుగు వారి ప్రాచీన కళలైన లలిత కళలో ప్రధానమైన కూచిపూడి, జానపద కళలతో కూడా ఎక్కువగా ప్రజలు వినోదం పొందేవారు. మధ్యలో పౌరాణిక, కూచిపూడి వంటి కళలకు ప్రాధాన్యత తగ్గి వీధి సినిమాలు, రికార్డింగ్ డ్యాన్స్‌ల హవా పెరిగినప్పటికీ ఇటీవల కాలంలో కూచిపూడి, జానపద నృత్యాలకు ఆధరణ పెరిగింది. ప్రతీ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవ వేడుకలలో కూచిపూడి జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసి వినోదం పొందుతున్నారు. ప్రస్తుతం టెలివిజన్, సెల్ ఫోన్ మాయాజాలంలో ఆట విడుపుగా కూచిపూడి నృత్య శిక్షణ నిలుస్తుంది. ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాల విద్యలో విద్యార్థులకు క్రీడా విద్య అంతంత మాత్రంగానే ఉండటంతో నృత్య శిక్షణ ద్వారా ఎంతో కొంత శారీరక శ్రమ, వ్యాయామాన్ని విద్యార్థులు అందించినట్లు ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. వీటితో పాటు విద్యార్థి దశలో సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంచేందుకు కూచిపూడి శిక్షణ ఉపయోగపడుతుందని కొందరు పేర్కొంటున్నారు. ఈ నృత్య శిక్షణ ద్వారా పేరు ప్రఖ్యాతులతో పాటు ఉపాధి మార్గంగా కూడా కొందరికి ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. అయితే ఒకప్పుడు పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన కూచిపూడి శిక్షణా సంస్థలు ప్రస్తుతం చిన్న చిన్న పట్టణాలలో కూడా ఏర్పాటు చేసి ఆసక్తి గల విద్యార్థులకు శిక్షణ అందజేస్తున్నారు. తణుకు పట్టణంలో 1985లో కాకరపర్తి కామేష్ మహానట కళామందిరం, కూచిపూడి జానపద నృత్య పాఠశాలను ఏర్పాటు చేసి ఎందరో విద్యార్థులను నృత్య కళాకారులుగా తీర్చిదిద్దారు. ఈసంస్థలో శిక్షణ పొందిన నృత్య విద్యార్థులు దేశ, విదేశాలలో నృత్య ప్రదర్శలు ఇస్తూ పేరు ప్రఖ్యాతులు ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం ఈయన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు కొందరు కూచిపూడి నృత్య పాఠశాలలను ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగారు. తణుకు పట్టణానికి జవ్వాది అంబికా కూచిపూడి శిక్షణ పొందడంతో పాటు రింగ్ డ్యాన్స్ ద్వారా గుర్తింపు పొందింది. పట్టణానికి బలిజేపల్లి శివానంద్ స్త్రీ వేషదారణలో నృత్యం ద్వారా గుర్తింపు పొందారు. వీరితో పాటు మరికొందరు కూచిపూడి నృత్యకారులు నృత్య పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఈపాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఒక వైపు పాఠశాల, కళాశాలలో విద్యను అభ్యసిస్తూనే, మరో వైపు కూచిపూడి, జానపద పాఠశాలలో నృత్య రీతులలో శిక్షణ పొందుతూ అభిరుచిని పెంచుకుంటున్నారు. ఈ అభిరుచితో వివిధ పండుగలకు దేవాలయాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసే వేదికలలో ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై జరిగే పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చడం ద్వారా కీర్తి ప్రతిష్టలు పొందుతున్నారు.



కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మనస్సుకు, శరీరానికి వ్యాయామం



విద్యార్థులను టీవీలు, సెల్ ఫోన్‌లకు అలవాటు తగ్గించేందుకు చిన్నప్పటి నుంచి కూచిపూడి, జానపద నృత్యాల పట్ల ఆసక్తిని పెంచడం ద్వారా వారు చదువులోనూ రాణిస్తారు. ఎక్కువగా కార్పొరేట్ పాఠశాలలో చదివే విద్యార్థులు తమ తలిదండ్రుల ఆసక్తి మేరకు కూచిపూడి నృత్య శిక్షణలో చేరుతున్నారు. నృత్యం విద్యార్థులకు మంచి వ్యాయామ ప్రక్రియగా కూడా ఉంటుంది.

– కె ఖ్యాతిశ్రీ, నృత్య శిక్షకురాలు, తణుకు

మన కళలపై అవగాహన పెరిగింది



మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు పరిరక్షణకు, ప్రోత్సాహం కల్పించాలనే అవగాహన పెరిగింది. గ్రామాల్లోని ప్రతీ వేడుకలలో కూచిపూడి, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు పెరిగాయి. గ్రామాల్లోని వివిధ పండుగల సందర్భంగా ఆలయాలలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి పెద్దలు మొగ్గుచూపుతున్నారు.

– కాకరపర్తి కామేష్, మహానట కళామందిరం కూచిపూడి, జానపద నృత్య పాఠశాల నిర్వాహకుడు, తణుకు

రాజ్యాంగం–సనాతన ధర్మం అంశంపై చర్చాగోష్ఠి

తణుకు: సనాతన ధర్మాన్ని పాటించడమంటే వర్ణాశ్రమ ధర్మాన్ని, కుల వ్యవస్థను, మనుధర్మ శిక్షాస్మృతి ఆచరించాల్సి వస్తుందని ప్రముఖ కవి, చరిత్ర ఉపాధ్యాయులు కొప్పర్తి వెంకటరమణ పేర్కొన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఉపముఖ్యమంత్రి పదవీబాధ్యతలు చేపట్టిన వ్యక్తులు సనాతన ధర్మాన్ని పాటిస్తామని చెప్పడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. సనాతన ధర్మం అంటే ఏమిటి? రాజ్యాంగం వెలుగులో సనాతన ధర్మాన్ని ఎలా విశ్లేషించాలనే అంశాలపై తణుకు సురాజ్య భవనంలో రాజ్యాంగం–సనాతనదర్మంపై పలు ప్రజాస్వామిక సంఘాలు ఆధ్వర్యంలో స్థానిక సురాజ్య భవనంలో గురువారం చర్చాగోష్ఠి నిర్వహించారు. డీవీవీఎస్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు సంకు మనోరమ, సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీకుమార్, సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్, డాక్టర్ రమేష్‌చంద్రబాబు, కొండే నాగేశ్వరరావు, గొల్లపలి అంబేద్కర్, పొట్ల సురేష్, కౌరు వెంకటేశ్వర్లు, ఈదరామకృష్ణ, ఆకుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న వక్తలు

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను రద్దు చేయాలి

తణుకు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21వ తేదీ నుంచి 6 రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో తిరుపతిలో శిక్షణ ఇవ్వడాన్ని ఏపీటీఎఫ్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ తెలిపారు. డీఎస్సీలో మెరిట్ ద్వారా ఎంపికైన నిష్ణాతులైన ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయడమే తప్ప ఈ శిక్షణ తరగతుల వలన విద్యార్థులకు ఎటువంటి ప్రయోజనం ఉండదని అన్నారు. ఇప్పటికే అనేక రకాల యాప్‌లతో బోధనేతర కార్యక్రమాల్లో సైతం ఉపాధ్యాయుల విలువైన సమయానికి నష్టం వాటిల్లుతుందని, ఒకవేళ శిక్షణ తరగతులు తప్పనిసరి అయితే వేసవి సెలవుల్లో నిర్వహించాలని కోరారు.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం రూరల్: అందరికీ ఆదర్శ కావ్యం రామాయణమని, అటువంటి రామాయణ మహా కావ్యాన్ని రచించిన వాల్మీకి ఆదర్శనీయుడిని ఎంపీడీవో విశ్వనాథ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార చట్టంతో పూర్తి సమాచారం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు తమకు కావలసిన సమాచారాన్ని పొందేందుకు సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపకరిస్తుందని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం పట్టణం చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ భవనంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం ఆవశ్యకత, ప్రాముఖ్యతను వివరించారు. కోఆపరేటివ్ అధికారులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే ప్రధానం

తణుకు టౌన్: మనిషికి శారీరక ఆరోగ్యం కంటే మానశిక ఆరోగ్యం ప్రధానమని ప్రముఖ హిప్నోథెరపిస్ట్ అక్కింశెట్టి రాంబాబు చెప్పారు. గురువారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆడిటోరియంలో నిర్వహించిన మానశిక సమస్యలు– పరిష్కార మార్గాలు అనే అంశంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి మానసికంగా దృఢంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. నేడు సమాజంలో అనేక విధాల మానసిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రోటరీ కార్యదర్శి కఠారి సిద్ధార్థ, సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతే సంపూర్ణ ఆరోగ్యం

తణుకు అర్బన్: విద్యార్థులు శారీరకంగాను, మానసికంగాను ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో కృష్ణుడి గుడి వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ కళాశాల స్టూడెంట్స్ హాస్టల్, కొమ్మాయి చెర్వు ప్రాంతంలోని సోషల్ వెల్ఫేర్ గరల్స్ హాస్టల్‌ను గురువారం ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా చేతుల పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యనివ్వాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు, వ్యాయామం, మెడిటేషన్ తప్పనిసరిగా ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ వై.మౌనిక, హాస్టల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులో హాస్టల్ సిబ్బందికి సూచనలిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

తణుకు: ఇటీవల తణుకు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఇటీవల మృతి చెందిన వ్యక్తి భౌతికకాయానికి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. 55 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు బుధవారం తణుకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో తణుకు ఉందుర్తి పాల్ ఫౌండేషన్, పైడిపర్రు–తేతలి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సన్ ఆసుపత్రి వైద్యులు శోభాశరణ్ ఆర్థిక సాయం చేసినట్లు సభ్యులు చెప్పారు. ఈ ఫౌండేషన్ చైర్మన్ ఉందుర్తి ప్రసన్నకుమార్, సభ్యులు దున్నా అమర్‌బాబు, నేకూరి తరుణ్‌కు, విప్పర్తి చెర్రీ, పసాల నాని, తలపాకుల అఖిల్, అభిషేక్ పాల్గొన్నారు.



తణుకులో అంత్యక్రియలు చేస్తున్న సంస్థ సభ్యులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు: తణుకు, ఇరగవరం, తేతలి, దువ్వ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తణుకు ఏడీఈ పి.శ్రీనివాస్ తెలిపారు. తణుకు మున్సిపల్ పరిధిలోని వేల్పూరు రోడ్డులోని భాష్యం స్కూల్ నుంచి గ్రాండ్ గోస్తనీ వరకు, లక్ష్మి థియేటర్ సెంటర్, తణుకు మండలం తేతలి, పైడిపర్రు, వద్దూరు, పసలపూడి, కొండయ్యపాలెం, దువ్వ, కోనాల, ముద్దాపురం, సూర్యారావుపాలెం, ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి 33కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం పరిధి హౌసింగ్ బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

తాడేపల్లిగూడెం (టీఓసీ): వన్ టౌన్‌లోని పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. మహాలక్ష్మినగర్ ఫీడర్‌కు సంబంధించి టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, మహాలక్ష్మినగర్, గుణ్ణం ఫంక్షన్ హాల్ రోడ్డు, తాడేపల్లి చెరువు ఏరియాలలోని విద్యుత్ ఉండదని తెలిపారు. అదే విధంగా విద్యుత్ వైర్లుకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను నరికేందుకు గాను టూ టౌన్‌లోని 11కేవీ టౌన్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ నరసింహమూర్తి తెలిపారు. జువ్వలపాలెం, మార్కెట్ ఏరియా, సవిత్రపేట, నవ్వారు పేట, ఏలూరు రోడ్డులలో విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలో రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సర్పంచ్‌లు విధులు, నిధులు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయించి మొదటి విజయం సాధించామన్నారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సహకారంతో గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధి బాధ్యతను కూటమి నాయకులు తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, జనసేన పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో గొంతాలమ్మ పండుగ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో శ్రీగొంతాలమ్మ (కుంతీదేవి) పండుగను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని కాళికా నృత్యాలు, తీన్‌మార్‌డప్పులు, బ్యాండ్ వాయిద్యాలమధ్య గ్రామంలో ఊరేగించారు. గ్రామ సర్పంచ్ తాడేపల్లి బేబి, పెద్ద సంఖ్యలో అంబేద్కర్ కమిటీసభ్యులు పాల్గొన్నారు.



కొమ్ముగూడెంలో గొంతాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

తణుకు టౌన్: భారతీయ జీవన చిత్రం రామాయణంలో ప్రతిబింబిస్తుందని ఉన్నతమైన మానవ విలువలతో కూడిన గ్రంథం రామాయణమని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్ చెప్పారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి రాసిన రామాయణంలో మానవ విలువలు, నైతిక విలువలను చక్కగా వివరించారని చెప్పారు.వాల్మీకి రామాయణంలో, వారధి నిర్మాణంలో ఉడుత చేసిన సేవ ఎంతో భక్తితో కూడుకున్నదన్నారు. నేటి కుటుంబవ్యవస్థ మాన వ సంబంధాలు, ఆచార వ్యవహారాలు రామా యణంలో దర్శించుకోవచ్చన్నారు. అధ్యాపకులు భూపాల్, డీ కనక మహాలక్ష్మీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై విజయకుమార్, బీఎస్ఎల్ పద్మశ్రీ, మారుతీదేవి చౌదరి, జీవన్ బాబు, వీ శివ ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్పర్రులో నేడు పల్లె పండుగ

పెంటపాడు: మండలంలోని పడమరవిప్పర్రు గ్రామంలో గురువారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొ ని పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు.